# గెలుపు నీదే

- బద్దిగం పాండురంగారెడ్డి

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను"

మూడేళ్ళ క్రితం ఆ మాటలను విని సత్యవతి మురిసిపోయింది. తన అందాన్ని, యవ్వనాన్ని నిలువుటద్దంలో చూసుకుని గర్వించింది.

అయితే ఇవాళ అవే మాటలు విని భయపడింది.

అటూ ఇటూ బెదురు చూపులు చూస్తూ నెమ్మదిగా అంది "నాన్నగారు వింటారు జాగ్రత్త" అని. ఆ మూడు మాటలను కలిపి చక్కని వాక్యం చేసి మురిపెంతో, ముచ్చటగా అన్నవాడు ఆనాడూ ఈనాడూ ఒక్కడే -మురళి.

"అన్ని నవలలు రాసేవు. గొప్ప రచయిత్రిననిపించుకున్నావ్. ఇంకా నాన్నంటే భయమేనా?"

సత్యవతి అసహాయురాలిలా తలవంచుకుంది. మనసులో బాధపడుతున్నట్టు మొహంలో అలుముకున్న నీలిమేఘాలు, కళ్లలో కమ్ముకున్న కారుమేఘాలు చెప్తూనే ఉన్నాయి.

"వయసులో ఉన్న ఆడపిల్లవి మనస్సులో మురిపెంతో పెంచుకున్న కోరికలను నవలల్లోకి ధైర్యంగా ఎక్కించినదానివి ఇంకా నాన్నను చూసి భయపడడం బాగాలేదు సత్యా. ధైర్యం తెచ్చుకో. నాన్న కోపాన్ని చూసి బెదిరిపోకు. నిర్భయంగా ఎదురునిల్చి నీ మనసు విప్పి చెప్పు. కాదంటే ఎదిరించు. నీ వెనుక నేనున్నాను"

ఆ పిల్ల ఆ పనిచేయలేదని ఆమె కళ్లల్లోని భీరుత్వమే చెప్తోంది. అయితే అలా చేయాలన్న కోరిక మరోవైపు కన్పిస్తూనే ఉంది. కాగా మురళి మాటల్ని కాదనడం ఎలా?

నిజానికి సత్యవతి చిన్నతనంనుంచి పెరిగిన వాతావరణం, స్వేచ్ఛా స్వాతంత్ర్య ప్రవృత్తికి, స్వకీయమైన ఆలోచనాశక్తికి ప్రేరణ ఇచ్చేటటువంటిది కాదు. ఆ ఇంట్లో డబ్బుకు కొరతలేదు. పుట్టిన దగ్గర నుంచి ఆ పిల్ల పరువుల మీదనే నడిచింది. మల్లెపూల సెజ్జల పైనే పడుకుంది.

అందుకే ఆ అమ్మాయికీ, నేలకూ దూరం. ఆకాశ విహారం తప్ప. నేలమీద నడవడం చాతకాలేదు. ఊహ పూర్తిగా తెలియకముందే తల్లి మరణించింది. తండ్రికి పిల్లల్ని కనడం కన్న పెంచడం బొత్తిగా తెలియదు. వృత్తి చేత రంగారావు న్యాయవాది. కానీ ఆయన ఆలోచనలెప్పుడూ అన్యాయంగానే ఉండేవి. ఊరంతా తన కనుసైగల్లో కదలాలని ఆయనకో పెద్ద కోరిక. ఆ కోరిక తీర్చుకోవడానికాయన ముందు ఇంటినుంచి బయలుదేరాడు.

బ్రతికున్నంతకాలం భార్య ఆయన చెప్పుచేతల్లో నలిగిపోయింది. పెద్దవాడు లా చదువుతానంటే "లా దేముందోయ్? మనం సమర్థులమైతే లా చదవకపోయిదా, మనం చెబితే లా అవుతుంది. మెడిసిన్ చదువు" అని ఆర్డర్ వేశాడు.

రెండోవాడికి నాటకాలంటే పిచ్చి. తండ్రికి తెలీకుండా నాలుగు నాటకాల్లో వేషాలు వేసి మంచినటుడని పేరు తెచ్చుకున్నాడు. అది తెలిశాక నాటకాలు గీటకాలు కట్టిపారేసి హాస్టల్లో ఉండి ఇంజనీరింగ్ చదవమని శాసించాడు రంగారావు.

ఊహ తెల్సిన దగ్గర్నుంచీ నాన్నంటే భయమే సత్యవతికి. వయసు పెరిగే కొద్దీ ఆమెలో కోరికలు ఒక్కొక్కటి విచ్చుకోసాగాయి.

తనూ స్కూల్లో తన స్నేహితురాళ్ళలాగా ఆడుకోవాలి. వేరుశనగ పప్పులు తింటూ షికార్లు చేయాలి. సినిమాలు చూడాలి. పత్రికల్లో నవలలు చదివి, టీవీలో సీరియల్స్ చూసి స్నేహితురాళ్లతో వాటి మంచి చెడ్డలను గురించి చర్చించాలి.

కానీ అవన్నీ తీరని కోరికలే. కారణం? తండ్రి ఆలోచనలకు అవి భిన్నం కావడమే.

కారు తనని సరిగ్గా టైంకు స్కూల్ వద్ద వదిలివెళ్తుంది. ఈలోగా స్నేహితురాళ్లతో అనవసర సంభాషణలు చేయరాదు. క్లాసు పుస్తకాలు తప్ప పత్రికలు, టీవీ చూడరాదు. తండ్రి ఆజ్ఞకు భంగంగా అలాంటి పనులు చేస్తే వెంటనే ఆయనకు తెలుస్తుంది. అందుకు ఆయన ఏర్పాట్లు చేసుకున్నాడు.

అందుకే సత్యవతి చిన్నతనంనుంచి ఇలాంటి కోరికలు పెంచుకోలేదు. తన స్వల్ప పరిధిలో కూర్చునే బంగారు కలలు కంది. తండ్రి, అన్నలు, నౌకర్లు మొదలైనవారంతా తనను ఎంతో ప్రేమగా చూస్తున్నట్లు, తను కోరిందల్లా కాదనకుండా, కోరినదే తడవుగా తీరుస్తున్నట్లు కలలు కని తృప్తిపడేది.

ఇంట్లో అలా తన ఆధిక్యతను నిలబెట్టుకున్నాక రంగారావు దృష్టిని బయటికి సారించి తన వృత్తి మీద కేంద్రీకరించాడు. వస్తుతః వృత్తిలో అంత ప్రతిభాశాలి రంగారావు. న్యాయధర్మాలు, సూక్ష్మాలను గురించి ఆలోచించే తత్వమూ కాదు. అందుక్కావలసిన ఓపికా లేదు. అయితే చిరకాలంగా ఆ ఊళ్ళో ఉన్నవాడు. కాగా వారి కుటుంబం ఆ ఊళ్లో ప్రసిద్ధమైనది. తండ్రి చేసిందీ న్యాయవాదవృత్తే. ఆ వృత్తిలో ఆయన ఎంతో శోభించి 'ఫలానా వాడు మంచి ప్లీడరు' అన్న పేరును వదిలివెళ్లేడు. తండ్రి వదిలి వెళ్ళిన ఆ పేరును నేర్పుగా వాడుకుని వృత్తిలో నిలబడ్డాడు.

అంతేకాదు వృత్తిలో వెలుగొందడానికి విపరీతమైన పద్ధతుల్ని అవలంబించాడు రంగారావు. తనకు స్వయంప్రతిభతో వృత్తిలో రాణించే నేర్పు ఎలాగూ లేదని రంగారావుకు తెలుసు. అందుకని 'ఇటునుంచి కాకపోతే అటుంచి నరుక్కొద్దాం' అన్న పద్ధతిలో ప్రత్యర్థులను పడగొట్టడంలో నేర్పు సాధించాడు.

రంగారావుది భారీ విగ్రహం. విశాలమైన నుదురు, పెద్ద పెద్ద కళ్ళు, వెడల్పైన పెదవులపైన గుబురైన మీసాలు. చూడగానే ఎంతవాడికీ భయం పుట్టేలా ఉంటుందాయన విగ్రహం. అందుకుతోడు ఖంగుమని మోగే కంఠం. కాగా తప్పులో ఒప్పులో ధారాళంగా మాటల్ని దొర్లించేయగలడు.

భగవంతుడిచ్చిన ఆ మహాకాయాన్ని, ఆ గొంతును, ఆ వాక్ప్రవాహ సౌభాగ్యాన్ని ఆయన చక్కగా వినియోగించుకున్నాడు. పాయింట్ లేకపోయినా గబగబ మాట్లాడి కోర్టు హాలును హడలగొట్టేవాడు. ప్రత్యర్థి వకీలు 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' అంటూ లేవబోయాడా రంగారావు గుడ్లురిమి చూసేవాడు 'వాకిట్లోకి రా నీ పనిపడ్తా' అన్నట్లు.

పైగా ఆ ఊళ్ళో అతని కంటూ ఓ గ్రూప్ ఉంది. ఆ గ్రూపునకు రాజకీయపు రంగు పూసాడు రంగారావు. తనేనాటికైనా పెద్ద రాజకీయవేత్త కావాలన్న కోరికకు ఈ గ్రూపును నాందిగా నిర్మించుకున్నాడు. అయితే అది నిజానికి రౌడీ గ్రూప్.

ఆ గ్రూప్‌లో వాళ్ళు చేసే అన్యాయమైన పనులన్నిటినీ వెనకేసుకువచ్చి వకాల్తా పుచ్చుకుని కోర్టులో వాదించేవాడు.

రంగారావుకి అయిష్టమైన పని ఆ ఊళ్ళో ఏది జరిగినా ఆ రౌడీగ్రూప్ కొట్లాటకు తయారవుతుంది. కొట్లాటలు ముదిరి వ్యవహారం కేసులు, కోర్టుల దాకా వస్తే రంగారావుకు రెండు లాభాలు. అటు తన పని నెరవేరుతుంది. ఇటు కోర్టులో తన ఫైలు పెరుగుతుంది. అందుకే ఆ ఊళ్ళో చాలా మంది రంగారావును ఆ పేరు పెట్టి పిలవరు. 'రౌడీ ప్లీడరు' అని కొందరు ముద్దుగా అంటే, మరికొందరు కచ్చగా అనుకుంటారు.

అవతలపార్టీ ప్లీడరు సిద్ధంగా లేనప్పుడు, సాక్షులు రానప్పుడు, సమయం చూసి కేసును విచారణకు పెట్టేలా చేసేవాడు రంగారావు. కోర్టు గుమస్తాలంతా రంగారావు బంధువులే. ప్రతి పండక్కి మామూలులాగా, అంతో ఇంతో ఇచ్చి వారి చేయి తడిపేసి వారిని తన చేతిలో ఉంచుకున్నాడు. ఇలా ఇంటా బయటా ఎదురులేకుండా సాగిపోతున్న రంగారావును మొట్టమొదటిసారిగా ముఖాముఖీగా ఎదుర్కొన్నవాడు మురళి.


★ ★ ★

మూడేళ్లక్రితం మురళి బిఎ ఫైనల్ ఇయర్ చదువుతుండేవాడు. సత్యవతి ఆ ఏడే ఇంటర్ పాసై బిఎలోకి వచ్చింది. అసలు రంగారావు సత్యవతి చదువును పదితోనే ఆపేయాలనుకున్నాడు. తన అభిప్రాయాన్ని కూతురితో చెప్పాడు.

కొడుక్కుల్లాగానే కూతురూ, తన కోరిక చెప్పుందని ఆశించాడు. అలా చెప్తే అదిలించి మూల కూర్చోపెడ్దామని కూడా నిర్ణయించుకున్నాడు.

కానీ సత్యవతి తండ్రి అభిప్రాయాన్ని విని ఎదురుచెప్పలేదు.

కంటనీరు కుక్కుకుంటూ, నిశ్శబ్దంగా అవతలికి వెళ్లింది. ఆమె వెంట రంగారావు కూడా లోపలికెళ్లాడు. అప్పటికే సత్యవతి కళ్లల్లో నీళ్ళు కట్టలు తెంచుకున్నాయి. వెళ్ళి కూతురు శిరస్సు మీద చెయ్యి వేశాడు. ఏదో వింత అనుభూతి. తనదన్న మమకారం పెల్లుబికింది.



"పైకి చదువుకోవాలని ఉందా తల్లీ?"

సత్యవతి ఆశగా తండ్రి వైపు చూసింది.

"చదువుకోమ్మా, నీవు చదువుకోవాలంటే నేను కాదంటానా?" అన్నాడు కన్నీళ్ళు తుడుస్తూ.


ఆ తర్వాత తనన్న మాటలకు తానే ఆశ్చర్యపోయాడు రంగారావు.

తండ్రి ప్రేమను సత్యవతి అనుభవించిందా ఒక్కరోజే!

కాలేజీలో చేరిన ఆ వాతావరణం చాలా కొత్తగా కన్పించింది ఏదో పులకరింతతో కుర్రాళ్ళు తన వంకచూస్తుంటే.

స్కూల్లో కూడా కుర్రాళ్ళు ఆమె వంక చూసేవారే. అయితే ఆ చూపుల్లో ఈ 'చురక'లేదు. వేడిలేదు. ఇక్కడి కుర్రాళ్ళు వేడివేడిగా తన వంక చూస్తుంటే ఒళ్లంతా చురుక్కుచురుక్కుమంటూ ఏదో వింత అనుభూతి. అందరిలోకి ఆ యువకుడు అబ్బ ఏం చూపో అతనిది? ఎలా నవ్వుతాడో?

ఆరోజు కాలేజీ లోపలినించి కారు వద్దకు బయలుదేరింది.



## అందం పెరిగిందా!

సినిమా తారలెక్కడ ఉన్నా సందడే సందడి. సినిమా ఆఫర్స్ ఎలా ఉన్నా వివిధ వ్యాపార ప్రకటనలతో తారలెప్పుడూ బిజీగా ఉంటారు. చూపులతోనే కవ్వించే కత్రినాకైఫ్ ఇప్పుడలాగే ఉంది. తన అందానికి తగ్గట్టుగా తయారవుతూ ఫ్యాషన్‌షోలతో పాటూ కంపెనీ యాడ్స్‌లో కన్పిస్తూ తెగ బిజీగా ఉన్నానంటోంది. అన్నట్టు సినిమాల్లో నటించేటప్పటికన్నా ఇప్పుడే ఆమె అందంగా ఉందంటున్నారు.




"క్షమించండి సత్యాదేవిగారూ ఒక్క విషయం"

కళ్ళెత్తి అతని వైపు చూసింది. అంతే... అతనే! నవ్వుతూ ఎదురుగా నిల్చుని ఉన్నాడు. తనవంకే ఆప్యాయంగా చూస్తూ. చురక గట్టిగా తగిలింది.

"నా పేరు మురళి, బిఏ ఫైనల్ ఇయర్. మీరనుమతిస్తే అనవసరపు ఉపోద్ఘాతాలు లేకుండా అసలు విషయానికొస్తాను"

"చెప్పండి" అన్నట్టు సత్యవతి కళ్ళు టపటపలాడాయి.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను"

ఆ మూడు మాటలు విని సత్యవతి మురిసిపోయింది. హృదయం ఆనందంతో వేగంగా కొట్టుకుంది. అయితే అంతలోనే అతని ఏకవచన సంబోధన గుర్తుకొచ్చింది. క్షణం క్రితం పరిచయం? అప్పుడే తనని అతని సొత్తు చేసుకున్నట్టు ఏమిటా పిలుపు? ఎంత సాహసం?

"ఏకవచనంలో సంబోధించానని ఆలోచించినట్టున్నారు. కావాలనే అలా అన్నాను. ప్రేమను వ్యక్తం చేయడానికి అదే మంచి మార్గం అని అలా పిలిచాను. కష్టం వేస్తే క్షమించండి.

ఇంతకీ మీకు పెళ్ళి చేసుకోవాలని ఉందా? ఉంటే మాత్రం నేనో అప్లికేషన్ ఇందువెంట దాఖలు పర్చుకుంటున్నాను. పరిశీలించి ఆజ్ఞలు జారీచేయండి"

అతను వెళ్ళిపోగానే ఏదో కొరత. అలాగే అతని సన్నిధిలో ఉంటే ఎంత బాగుండును?

* * *

ఇంటికెళ్లగానే తన అందాన్ని నిలువుటద్దంలో పరీక్షగా చూసుకుని సత్యవతి గర్వించింది. తన పక్కన అతన్ని నిలబెట్టుకుని చూసుకుని మురిసిపోయింది. అతన్ని గురించి ఆలోచించేకొద్దీ, ఆమె మనసు పూల ఊయలలా పరిమళిస్తూ ఊగసాగింది. చేసుకుంటే అతన్నే పెళ్లి చేసుకోవాలి. ఈ తడవ అతను అడిగితే అదే చెప్పాలనుకుంది.

కానీ తీరా వారం తర్వాత అతను ఎదురై "నా అప్లికేషన్‌పై ఏం ఆర్డర్ వేశారు?" అని అడిగినప్పుడు "మా నాన్నగారికి దాఖలు చేశాను. వారిని అడగండి" అంది తనూ చిలిపిగానే.

అయితే చిలిపిగా అనాడన్న ఆ మాట తర్వాత నిజంగానే అతను తన తండ్రిని అడిగినప్పుడు అంతగా విషమిస్తుందనుకోలేదు.

"ఊఁ.. అయితే నా కూతుర్ని ప్రేమిస్తున్నానంటావ్?" రంగారావు మీసాలు దువ్వుకుని, చుట్ట వెలిగించి కళ్ళు పెద్దవి చేసి చూస్తూ గంభీరంగా అన్నాడు.

"నా కూతుర్ని ప్రేమించడానికి నీకు గల అర్హతలేమిటి?"

"ప్రేమించగల మంచి హృదయం ఉండడం మాత్రమే"

"ప్రేమించగల హృదయం ఉందిట. నీకేనా ఆ బోడి హృదయం ఉంది?! అందమైన ఆడపిల్లను, అందునా డబ్బు కలవారింటి ఆడపడుచును చూస్తే ప్రతి వెధవకి హృదయాలు మొలుచుకొస్తాయి.

నువ్వేమైనా ఓ డాక్టర్‌వా? ఇంజనీరువా? ప్లీడరువా? కనీసం గుమస్తావన్నా కావే? నా అంతస్థు ఎక్కడ? నీ అంతస్థు ఏమిటి? నా ముందు నిలబడి నా కూతుర్ని ప్రేమించానంటావా? మళ్లీ ఓ మారిలా చేస్తే మూతి పళ్ళు రాలగొడతాను"

"పళ్ళు రాలగొట్టడం మీకొక్కరికే కాదు చాతనయింది. నాకూ చాతనవును" కుర్చీలో కూర్చుని కాళ్ళు స్టూలుమీద పెట్టి ఠీవిగా అన్నాడు మురళి.

అతని పద్ధతి చూసి చటుక్కున కుర్చీలోంచి లేచాడు రంగారావు.

"మర్యాద అనేదాన్ని మనం ఇస్తేనే మనకొకరు ఇచ్చేది. రౌడీతనాన్ని కోర్టులో చూపిస్తే సరిపోతుంది గానీ ప్రతివాళ్ళ దగ్గర పనికొస్తుందనుకోకండి"

"మొదటిసారి కనుక ఇంతటితో సరిపుచ్చుతున్నా"

అంతదూరం వెళ్లినవాడు కాస్త ఆగి వెనక్కి చూస్తూ అన్నాడు. "ఇవాళ మీ చేత తిరస్కరించబడ్డాను. మరోరోజు మీరే పిల్చి మీ పిల్లనిస్తామంటారు. అంతవరకూ సెలవ్" చకచకా వెళ్ళిపోయాడు.

రంగారావు స్థాణువే అయ్యాడు. అంతా విన్న సత్యవతికి అతని పైన ప్రేమ ఎక్కువైంది. ఆ తర్వాత సత్యవతి చదువు ఆగిపోయింది.

* * *

"నేను నిన్ను ఇంకా ప్రేమిస్తున్నాను. నన్ను నిజంగా నువ్వు ప్రేమిస్తుంటే మూడేళ్లు నాకోసం ఆగలేవా సత్యా"

ఉత్తరాన్ని హృదయానికి హత్తుకుని పెట్టెలో దాచిపెడ్తూ అనుకుంది సత్యవతి. 'మూడేళ్ళు ఆగితే ఆతర్వాత ఏం చేస్తాడో? అసలీ మూడేళ్ళు ఏం చేస్తాడో?' అతనేం చేస్తేనే కాక కానీ ఈ మూడేళ్ళలో సత్యవతి జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమైంది.

మనసులో పేరుకుని పోతున్న కోరికల బరువు భారం పెరిగిపోయింది. మురళితో రానున్న తన జీవితాన్ని గురించిన కలలు ఎక్కువయ్యాయి. తీరని కోరికల్ని కంటున్న కలలని కాగితం మీద పెట్టింది. నవలా రూపంలో అందంగా, ఆకర్షణీయంగా రాసి పత్రికలకు పంపసాగింది.

ప్రతి స్త్రీకి అందమైన భర్తను పొందాలని, ఆ భర్తతో కారులో సాయంత్రం బీచ్ ఒడ్డున షికారు చేసి రాత్రికి పేద్ద హోటల్లో రూఫ్‌గార్డెన్‌లో భోంచేసి ఇంగ్లీషు సినిమాకు పోవాలని, కాశ్మీర్‌లో ప్రకృతిదృశ్యాల మధ్య భర్తమీద ఒరిగి అందంగా నడవాలనీ, తనవాళ్లంతా తనని కంటిపాపలాగా చూడాలనుకుంటుంది. తన కాల్లో ముల్లు గుచ్చుకుంటే ఇంటిల్లిపాదీ కాళ్లరిగేలా అటూ ఇటూ పరుగెత్తాలనీ...ఇలాంటి కోరికలు ఉండడంలో అసహజమేం లేదు. అయితే ఈ కోరికలు మనసులో అడుగుపొరల్లో ఉంటాయి. నిజ జీవితానుభవం వల్ల, అడుగుపొరల్లోని ఆ కోరికలు అక్కడే ఉండిపోతాయి.

ఒంటరిజీవితం, బందిఖానా బతుకు సత్యవతిలో ఈ కోరికలకు ఊపిరి పోసి వెలికితెచ్చాయి. నవలల్లో ఆమె ఆలోచనలూ అలాగే కొనసాగాయి. ఇప్పుడామె నవలలు చదివేక చాలామంది స్త్రీలలో ముఖ్యంగా యువతుల్లో ఈ కోరికలు విజృంభించాయి.

అయితే అవి తీరేదెలా? ఆమె రాసిన నవలల్నే మళ్లీ మళ్ళీ చదివి మానసికానందాన్ని పొందసాగారు. సత్యవతి ప్రసిద్ధ రచయిత్రి అయింది. పత్రికలు, ప్రజలు ఆమె నవలలకోసం ఎగబడ్డారు. మూడేళ్లలో పది నవలలు రాసింది. మూడులక్షలకు పైగా సంపాదించింది. రంగారావు కూతురి ఈ రచనా వ్యాసంగాన్ని కాదనలేదు. అభిమానుల ఉత్తరాలను రంగారావే చదివేవాడు. ఆమెని చూసి పోదామని వచ్చిన వాళ్ళకు లభ్యమయ్యేది రంగారావు దర్శనం మాత్రమే. ఆ మూడేళ్ళు ప్రతి నిముషం మురళిని గురించి ఆలోచించింది సత్యవతి. అయితే రంగారావు మాత్రం కూతురి పెళ్ళి విషయం ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు.

* * *

"నేనతన్ని ప్రేమించాను నాన్నగారూ! పెళ్లి చేసుకుంటాను"

కూతురు మాటల్తో రంగారావు కళ్ళు నిప్పు కణికలయ్యాయి. అతన్ని ప్రేమిస్తున్నానంటూ అన్నందుకు కాదు. తన ఎదుట నిల్చి ధైర్యంగా కూతురు ఆ విషయాన్ని చెప్పినందుకు.

"ఎవర్ని?" అని అడుగుతాడనుకుంది సత్యవతి. కానీ రంగారావు అడగలేదు.

సత్యవతి అతనితో మాట్లాడడం, అలా మాట్లాడుతున్నప్పుడు కూతురి మొహంలో కోటి దీపాల వెలుగు, ఆయన చాలాసార్లు చూశాడు. చూడనట్లు ఊరుకున్నాడు. కారణం? కూతురు పెళ్లీడు కొచ్చిందని, పెళ్లి చేయక తప్పదని రంగారావుకు తెలుసు. మరి అతను నల్లగౌను తొడిగిన నాలుగు నెలలకే తల నెరసిన ప్లీడర్ చేత భేష్ అనిపించుకున్నవాడు. అతను తన అల్లుడు కావడం తనకి గొప్ప, తన తెలివితేటలకు గీటురాయి.

రంగారావుకి అతన్ని చూసిననాడే అభిమానం కలిగింది.

ఆనాడు రంగారావుకు బాగా గుర్తు-

సీనియర్ ప్లీడర్ సీతారామయ్యగారిని ఎలా దెబ్బకొట్టడమా అని ఆలోచిస్తూ కూర్చున్నాడు బార్‌రూమ్‌లో.

"నమస్కారం రంగారావుగారూ, గుర్తున్నానా నేను?"

నిజానికి అతనెవరో గుర్తులేదు రంగారావుకు. అయినా ఆ విషయాన్ని ఒప్పుకునేతత్వం కాదాయనది.

"ఎంత మాట? నువ్వు గుర్తులేకపోవడమేమిటోయ్! బాగున్నావా?" అన్నాడు.

"గుర్తుంటే మన పరిచయం ఎక్కడో చెప్పండి చూద్దాం"

రంగారావు ఈ పరిస్థితిని ఊహించలేదు. వెలక్కాయ నోట్లో పడ్డట్టయింది.

"మీకు గుర్తులేదు. నామీద అభిమానం కొద్దీ అలా నటిస్తున్నారు. అవునా?"

అయినా ఇతనెక్కడ మనిషి? ఇంత నిర్మొహమాటంగా మాట్లాడుతున్నాడు?

## ఉపాస్

ఆస్ట్రేలియాలో ఒక వింత వృక్షం కీటకాలను, పక్షులను పట్టి చంపేస్తుంది. ఉపాస్ అని పిలువబడే ఈ చెట్టు బీజకోశాల నుండి ఒక విధమైన జిగట పదార్థం స్రవిస్తుంటుంది. ఇదే ప్రాణాంతకం. అమాయకమైన పక్షులు తెలియక చెట్టు మీద వాలి నిష్కారణంగా చనిపోతుంటాయి. విత్తనాలు రెక్కలకు అంటుకుపోతాయి. పక్షి ఎగరడానికి ప్రయత్నిస్తుంటే ఇంకా విత్తనాలు, కొమ్మలు అంటుకుపోయి ఊపిరి ఆడక చనిపోతాయి.


## ఇంగ్లీషు రాదు

1714 నుండి 1727 వరకు ఇంగ్లండ్‌ను పాలించిన 1వ జార్జి ఇంగ్లీషు మాట్లాడలేదు, వ్రాయలేదు. ఇతడు జర్మనీ హనోవర్ ఎలక్టార్ అయిన ఎర్నెస్ట్ అగస్టస్ మరియు ఇంగ్లండ్ జేమ్స్ 1వ మనమరాలు సోఫియా కుమారుడు.

## తేనె

ఒక పౌను తేనెను సేకరించడానికి ఎనభై వేల తేనెటీగలు ఒకరోజు ముప్పయి మూడు లక్షల పూల మీద వాలుతాయని తేనెటీగలను పెంచే నిపుణులు అంటున్నారు. అంత కష్టపడితే గానీ అమృతతుల్యమైన తేనె తయారుకాదన్నమాట.

\- ప్రసాద్



"వాస్తవం చెప్పాలంటే నాకూ జ్ఞాపకం లేదు సార్. బహుశా మా నాన్నగారి వద్ద కొచ్చినప్పుడు చూశానేమో. మా నాన్నగారు మీకు తెలుసుననుకుంటా"

తెలుసునంటే ఏమో? తెలీదంటే ఏమో? అందుకే ఏమీ మాట్లాడలేదు.

"సరే అసలు విషయానికొస్తా. నేను లా పాసయ్యాను. ఈ ఊళ్లో ప్రాక్టీస్ చేయమన్నారు నాన్నగారు. మొదటిసారిగా ఈవాళే కోర్టుకు రావడం, కేసు వాదించే ముందు మీ ఆశీస్సులు తీసుకోమన్నారు నాన్న. అందుకే వచ్చా"

రంగారావు ఉబ్బిపోయాడు. అతని మాటల్లోని ఆకర్షణకు బానిసయ్యాడు. తనకు జూనియర్‌గా ఇలాంటి కుర్రవాడుంటే? అదే అడిగాడు.

అతను చాలా బాధపడుతున్నట్టుగా మొహం పెట్టేడు. ఒక్క క్షణం ఆగి చాలా విచారంగా అన్నాడు. "నిజంగా నేను చాలా దురదృష్టవంతుడ్ని సార్. లేక పోతే ఇంతటి సదవకాశాన్ని ఉపయోగించుకోలేని స్థితిలో ఉంటానా? మూడు రోజులే అయింది సార్ సీతారామయ్యగారి వద్ద జూనియర్‌గా చేరి. మీరిలా నా మీద దయ చూపిస్తారని తెలిస్తే..."

## ఆత్మరక్షణ

పిల్లి పిల్లలు గుడ్డివిగా జన్మించడం, వాటి ఆత్మరక్షణ కోసమే. ఇవి పుట్టీ పుట్టడంతో అటూ ఇటూ పరుగెత్తి అపాయాలకు గురి కాకుండా ఉండటా నికి ప్రకృతి సహకరిస్తుంది.

## ప్రేమలేఖ

దాదాపు 220 సంవత్సరాలకు పూర్వం బ్రిటిష్ అడ్మిరల్ లార్డ్ నెల్సన్ తన ప్రియురాలులేడీ డెమ్మా హామిల్టన్‌కు వ్రాసిన ప్రేమలేఖ బహిరంగ వేలంలో నాలుగువేల నాలుగువందల పౌండ్లకు అమ్ముడయింది. గొప్పవా రిలాగే వారు రాసుకునే ప్రేమలేఖలు కూడా విలువైనవే.

## పక్షిజాతులు

భారతదేశంలో మొత్తం 1200 జాతుల పక్షులు ఉన్నట్లు అంచనా వేయబడింది. ఇవి ప్రపంచంలో ఉన్న మొత్తం ఎనిమిదివేల ఆరువందల పక్షుల జాతులలో సుమారు 14 శాతానికి సమానం. ఉపజాతులు లేక భౌగోళిక జాతులతో కూడి భారతదేశపు పక్షులలో మొత్తం 2061 రకాలు ఉన్నాయి. వీటిలో 1750 జాతులు భారతదేశంలో స్థిరంగా ఉండేవి. మిగ తావి వలసలుపోయే పక్షులు.

- ప్రసాద్




సీతారామయ్య జూనియర్ అని వినగానే రంగారావు ఆలోచన ఇవాళ తన కేసు మీదికి పోయింది. తను ఇవాళ వాదించాల్సిన కేసుకు ఇతన్ని పంపిస్తే బాగుండును. కొత్త వాడు ముప్పుతిప్పలు పెట్టి తన ప్రజ్ఞ చూపవచ్చు అనుకు న్నాడు. కోర్టు గుమస్తాల వద్దకెళ్లి అవసరమైన బోల్టులను బిగించుకుని వచ్చాడు. అదృష్టం. సీతారామయ్య జూనియర్‌గా అతనే వచ్చాడు. అనుకున్న ట్టుగానే వాయిదా అడిగాడు.

రంగారావు అభ్యంతరం తెలిపాడు సీనియర్ రిక్వెస్ట్ లేందే వాయిదా వేయ డానికి వీల్లేదని. కేసు వింటానన్నారు కోర్టువారు.

అయిపోయింది. కేసు గెల్చాననుకున్నాడు రంగారావు. అబ్బాయి తెలగుడ్లు వేస్తాడని ఆశించాడు. అతను వాదన సాగించాడు.

అరగంట అయింది. కోర్టు నిశ్శబ్దంగా వింటోంది. ఎవరీ కుర్రవాడు? ఏమి పరిశీలనాశక్తి? ఏం వాగ్ధాటి? రంగారావే తెలగుడ్లు వేయాల్సి వచ్చింది.

కేసు అతని పక్షమైంది.

"క్షమించండి. మొదటి కేసే మీకు వ్యతిరేకంగా వాదించాల్సి వచ్చింది. పిల్ల వాడని మీరు దయతలచి వదిలేయబట్టి సరిపోయింది. కానీ లేకపోతే ఇవాళ చాలా భయపడ్డాను సార్!" అంతవరకూ కేసు పోయినందుకు విచారం, ఇప్పుడో కేసు పోయినా అది తను కావాల్సి వదిలేయడం వల్ల పోయిందన్న తృప్తి. తన గొప్పతనాన్ని అతను గుర్తించినందుకు ఆనందం.

"ఏమైనా కోర్టులో మనం శత్రువులం. బయటికొచ్చాక మిత్రులం. బంధు వులం. చిత్రం కదూ సార్ మన ప్రొఫెషన్?"

రంగారావు అతని ఆకర్షణకు లొంగిపోయాడు. మాటరాక నవ్వాడు.

మొదటి నాలుగు నెలల్లోనే అతను బాగా ఎదిగిపోయాడు. ఎవరినోట విన్నా అతని పేరే. పొగడ్తే.

అదేం ఖర్మోగాని, అతను గెలిచిన చాలా కేసులు రంగారావుకు వ్యతిరేకం గానే. రంగారావుకు అతన్ని చూసేకొద్దీ అతని చేతిలో ఓడే కొద్దీ అతన్ని తన జూనియర్ చేసుకోవాలన్న కోరిక పెరగసాగింది. అందువల్ల రెండు లాభాలు. తన ప్రత్యర్థి తనవాడైపోతాడు. తన ఫైలు పెరుగుతుంది.

కాని ఎలా?

అతనితో స్నేహం చేశాడు. ఇంటికి పిల్చాడు. విందులిచ్చాడు. కూతుర్ని పరిచయం చేశాడు. రాకపోకలు పెరిగాయి.

జూనియర్ చేసుకుందామని రంగారావు గాలం వేస్తే అల్లుడు కావడానికి అతను ఎత్తువేశాడు.

"ఏమిటి నాన్నగారూ ఆలోచిస్తున్నారు?"

రంగారావు కూతురు వైపు చూశాడు. కాస్త సర్దుకుని కూర్చుని తల ఊపుతూ అన్నాడు. "అయితే అతన్ని ప్రేమించానంటావు? మరి అతను నిన్ను ప్రేమించాలిగా? ప్రేమిస్తున్నానని నీతో చెప్పాడా?"

చెప్పేడన్నట్టు తల ఆడించింది.

రంగారావుకు కోపం వచ్చింది. ఆ విషయం చిన్నపిల్ల దగ్గరకెళ్లి చెప్పే బదులు తనతో చెప్పేనేం? కాదంటాడా తను?

"నా దగ్గరకొచ్చి నా కుతుర్నివ్వమని అడిగేదాకా ఈ ప్రేమల్ని-పెళ్ళిళ్ళను నేను అంగీకరించను" గట్టిగా అన్నాడు.

"అతను మీ వద్దకొచ్చి అడగడట"

"అడగడూ?"

"ఆడపిల్ల తండ్రి మీ నాన్నగారే నన్ను అడగాలని చెప్పాడు"

రంగారావు ఆలోచించాడు. తను అడిగితే ఒప్పుకుంటాడన్నమాట.

"ఊ.."

ఇంత విని ఆఖరికి ఉ:తో ఊరుకున్నాడంటే అవతలవారు చెప్పింది అంగీక రించినట్టేనని అర్థం.

* * *

రంగారావు వెళ్లేసరికి అతడేదో పుస్తకం చదువుతున్నాడు. ఆయన్ని మర్యాద చేశాడు.

"కష్టపడి మీరింత దూరం రావాలా? కాకితో కబురు పంపిస్తే..."

రంగారావు పొంగిపోయాడతని మాటలకు.

"నువ్వు వచ్చే పనికాదులేవోయ్. ఆడపిల్ల తండ్రిని. నేను రావాల్సిన పనే. అమ్మాయి అంతా చెప్పింది లేవోయ్"

అతను ముసిముసి నవ్వులు నవ్వాడు.

"అమ్మాయి నిన్నే ప్రేమిస్తున్నదిట. నిన్నే పెళ్లి చేసుకుంటానని అది రాసిన నవలల్లో కథానాయికలాగా తెగేసి చెప్పింది. ఎలా కాదనను చెప్పు? నీకూ అభ్యంతరం లేకపోతే.."

"నాకేం అభ్యంతరం లేదు కానీండి మీరే బాగా ఆలోచించండని నా సలహా. నేనేం డాక్టర్‌ని కాదు, ఇంజనీర్‌ని కాదు, నిన్నగాక మొన్న బోర్డు కట్టిన ప్లీడర్ని..."

రంగారావుకీ మాటలు ఎక్కడో విన్నట్లు అనిపించింది.

పరీక్షగా అతని వైపు చూశాడు.

"ప్లీడరు బోర్డు కట్టగానే కేసులొస్తాయన్న గ్యారంటీ ఏమిటి? ప్రేమించే మంచి హృదయం తప్ప నాలో ఏం చూసి మీ అమ్మాయిని నాకిస్తామంటున్నారు?"

రంగారావుకి అతనితో పరిచయం ఎక్కడయిందీ ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది.

"అయినా మీరడుగుతున్నారు గనుక ఆల్‌రైట్. మీ అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుంటున్నాను" ఆ అనడంలో ఠీవి ఉంది, అమాయకత్వం ఉంది, ప్రేమ ఉంది.

అయితే ఆనాడు అన్నమాటను అతను అక్షరాలా నెరవేర్చుకున్నాడన్న మాట. తనని ఓడించాడన్నమాట.

అయినా అతను తనని ఇవాళ ఓడించడమేమిటి? నల్లగౌను వేసుకున్న మొదటిరోజే మాటల్తో ఓడగొట్టేడు.

ఆ తర్వాత కేసులో ఓడించాడు. అలా ఎన్నిసార్లు తనని తన ఊహల్ని తారుమారుచేసి ఓడగొట్టలేదు కనుక? అయినా తనకు కోపం రాలేదు. పైగా ప్రేమే పెరిగింది.

"జయించావోయ్ అల్లుడూ.. నువ్వే జయించావు. ఒప్పుకున్నా.." భుజం మీద గట్టిగా చరుస్తూ ప్రేమగా అన్నాడు.

"కానీ నీకు ఊరికే అమ్మాయిని ఇవ్వడం లేదు. కన్యాశుల్కంగా నువ్వా సీతారామయ్యను వదిలి నా దగ్గర జూనియర్‌గా చేరాలి"

అతను నవ్వేడు.

"అంటే మీరింకా ప్లీడరు వృత్తి సాగిద్దామనుకుంటున్నారన్నమాట. నేనుండగా మీకెందుకు సార్ ఇంకా ఆ శ్రమ? ఆ పనులన్నీ నేను చూసుకుంటాగా? మీరు హాయిగా ఆ వృత్తి మానేసి..."

"అయితే నన్ను అప్పుడే వానప్రస్థం స్వీకరించమంటావా ఏంటి?"

"కాకపోతే రాజకీయాలు వృత్తిగా స్వీకరించండి. మీ లాంటివాళ్ళు ఆ వృత్తిలో షైన్ కావచ్చు. మీ పద్ధతులు అక్కడ బాగా పనికొస్తాయి. న్యాయవాద వృత్తిలో ఆ పద్ధతులు పనికిరావు సార్. అందువల్ల ఈ వృత్తి మీకూ లాభదాయకం కాదు. ఆ వృత్తికీ శ్రేయస్కరం కాదు"

ఆలోచిస్తే అల్లుడు చెప్పున్న మాటల్లోనూ రీజన్ కన్పించింది రంగారావుకు. పొలిటీషియన్ కావాలన్నది తన చిరకాలవాంఛ. అల్లుడి పుణ్యమా అని అది తీరుతోందిప్పుడు.

ఎన్నో ఏళ్లుగా ఆ ఇంటిముందు వేలాడుతున్న 'రంగారావు-బిఏ, బిఎల్-అడ్వకేట్' అన్న పాత బోర్డు స్థానంలో 'కె.మురళీమోహన్-బిఏ, న్యాయవాది' అన్న బోర్డు వెలిసింది.

ఆ బోర్డుల మార్పిడీ జరిగిన రోజు రాత్రి-

సత్యవతి అతని గదిలోకి వెళ్లింది. అతను లా పుస్తకానికి బదులుగా ఆమె రాసిన నవలనొకదాన్ని చదువుతున్నాడు.

ఆమె ఆ పుస్తకం మూసేసి తనని పలకరిస్తాడని ఎదురుచూసింది ఊహూ...

ఎంతకూ దాన్ని వదలందే.

తనే వెళ్లి ఆ పుస్తకాన్ని మెల్లగా లాగి అవతల పడేసి నవ్వింది సత్యవతి.

"నువ్వప్పుడే వచ్చావా? కాస్సేపు నవలేదైనా రాసుకుంటావనుకున్నాను" అన్నాడే కానీ అతనికీ తెలుసు ఆమె ఇక అలాంటి నవలలు రాయదని. రాయలేదని. కలలు కనే కాలం-కోరికలను పెంచుకునే కాలం గతించిపోయింది. వాస్తవ జీవితం రుచి చూస్తూ కోరికలను అందినంతమేర తీర్చుకునే కాలం వచ్చింది.

"ఉహుఁ." అందామె.

"ఇంకా ఎందుకు నేను నవలలు రాయడం? మీరున్నారుగా నాకు?"

అతనామెను ఆప్యాయతతో దగ్గరకి తీసుకున్నాడు.

★



## కలిసొస్తుందా?

భూమిక చావ్లా పేరు వింటే ఆమె నటించిన సినిమాలు మనమదిలో మెదులుతాయి. తెలుగులో ఇప్పుడు అవకాశాలు తక్కువగా ఉన్నా ఈ భామ బాలీవుడ్‌లో ముందుకు దూసుకుపోవాలనుకుంటోంది. అందుకేనేమో అవకాశాల కోసం ఆమె తెగ ప్రయత్నాలు చేస్తోంది. అన్నట్టు భూమిక ఇప్పుడు అక్షయ్‌కుమార్ సరసన నటిస్తోంది. రాజ్‌కుమార్ సంతోషి కొత్తచిత్రంలో ఆమె కొత్త నటులతో కలిసి నటించనుంది. ఈ కొత్త అవకాశం ఆమెకి ఎలా కలిసి వస్తుందో చూడాలి మరి!

